epaper.manachourasta.com

# మన చౌరాస్తా

The Complete News way

మన చౌరాస్తా Channel Telugu News

సంపుటి : 01 | సంచిక : 119 | శనివారం | 28.09.2024



## దొరికితేనే.. దొంగ..!

### జనగామలో లంచావతారులు

- పట్టుబడుతున్న తగ్గని అధికారులు
- జిల్లా కేంద్రంలో మరోసారి ఏసీబీ ట్రాప్
- రూ.14 వేలు లంచం తీసుకుంటూ చిక్కిన ఆర్‌అండ్‌బీ ఈఈ
- ఈఈతో పాటు అసిస్టెంట్ టెక్నికల్ ఆఫీసర్ అరెస్ట్

2లో..

'దొరికితే దొంగ.. లేదంటే దొర' అన్నట్టుగా తయారయ్యారు జనగామ జిల్లాలోని కొందరు అధికారులు.. జిల్లాలో ఏసీబీ అధికారులు వరుస దాడులు చేస్తూ హడలెత్తిస్తున్నా.. లంచగొండి అధికారుల్లో మాత్రం మార్పు రావడం లేదు. గడచిన ఏడాదిన్నర కాలంలో దాదాపు 12 మందిని ఏసీబీ వల పన్ని పట్టుకుంది. అయినా మిగతా ఉద్యోగుల్లో ఎలాంటి భయం కనిపించడం లేదని తెలుస్తోంది. ఇందుకు జనగామ కలెక్టరేట్‌లో జరిగిన మరో ఏసీబీ దాడినే ఉదాహరణగా చెప్పవచ్చు.. గతంలో కలెక్టరేట్‌లో లంచం తీసుకుంటూ పట్టుబడిన డీఎంహెచ్‌వో డాక్టర్ శేపూరి ప్రశాంత్ ఘటన మరువకముందే మళ్లీ అదే కలెక్టరేట్‌లో మరో ఇద్దరు ఉద్యోగులు ఏసీబీకి చిక్కడం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది.

*- మన చౌరాస్తా, జనగామ ప్రతినిధి*



## ఇచ్చిన హామీలను నిలబెట్టుకున్నాం

- దేవాదాయ, అటవీ పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ
- చేర్యాలలో కళ్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

4



### ట్రాఫిక్ రూల్స్ తప్పక పాటించాలి

- జనగామ కలెక్టర్ రిజ్వాన్ బాషా

2



### బాపూజీ.. బలహీన వర్గాల ఆశాజ్యోతి

- జిల్లాలో ఘనంగా జయంతి వేడుకలు

3



### విద్యార్థి గర్జనకు తరలిన జనగామ నేతలు

- చిక్కడపల్లిలో సీఐ ఓవర్ యాక్షన్

2

General News



# దొరికితేనే దొంగ..!

## జనగామ జిల్లాలో లంచావతారులు

- పట్టుబడుతున్న తగ్గని అధికారులు
- జిల్లా కేంద్రంలో మరోసారి ఏసీబీ ట్రాప్
- రూ.14 వేలు లంచం తీసుకుంటూ చిక్కిన ఆర్అండ్‌బీ ఈఈ హుస్సేన్
- ఈఈతో పాటు ఏటీవో అరెస్ట్



**మన చౌరాస్తా, జనగామ ప్రతినిధి :** 'దొరికితే దొంగ.. లేదంటే దొర' అన్నట్టుగా తయారయ్యారు జనగామ జిల్లాలోని కొందరు అధికారులు.. జిల్లాలో ఏసీబీ అధికారులు వరుస దాడులు చేస్తూ హడలెత్తిస్తున్నా.. లంచగొండి అధికారుల్లో మాత్రం మార్పు రావడం లేదు. గడచిన ఏడాదిన్నర కాలంలో దాదాపు 12 మందిని ఏసీబీ వల పన్ని పట్టుకుంది. అయినా మిగతా ఉద్యోగుల్లో ఎలాంటి భయం కనిపించడం లేదని తెలుస్తోంది. ఇందుకు జనగామ కలెక్టరేట్ లో జరిగిన మరో ఏసీబీ దాడినే ఉదాహరణగా చెప్పవచ్చు.. గతంలో కలెక్టరేట్ లో లంచం తీసుకుంటూ పట్టుబడిన డీఎంహెచ్‌వో డాక్టర్ శేపూరి ప్రశాంత్ ఘటన మరువకముందే మళ్లీ అదే కలెక్టరేట్ లో మరో ఉద్యోగి ఏసీబీకి చిక్కడం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. శుక్రవారం జరిగిన ఈ ఘటన వివరాలను ఏసీబీ డీఎస్పీ సాంబయ్య మీడియాకు వెల్లడించారు.

**హిందూస్థాన్ పెట్రోల్ బంక్** వారు గత ఏడాది జూన్‌లో జిల్లాలోని లింగాలఘణపురం మండలంలో కొత్త పెట్రోల్ బంక్ ఏర్పాటు కోసం నోటిఫికేషన్ ఇచ్చారు. ఇందు కోసం మండలానికి చెందిన మాజీ సైనిక ఉద్యోగి చిర్ర సత్యపాల్‌రెడ్డి తన భార్య పేరుపై దరఖాస్తు చేసుకున్నాడు. డ్రా పద్ధతిలో వారికి పెట్రోల్ బంక్ అలాట్ అయ్యింది. ఈ క్రమంలో వరంగల్ సీపీ కార్యాలయం నుంచి జిల్లాలో ని ఆర్డీవో, డీపీవో, పోలీసు శాఖతో పాటు ఆర్అండ్‌బీ శాఖకు ఎన్‌వోసీ కోసం రెఫర్ చేశారు. అయితే ఆర్అండ్‌బీలో పనిచేస్తున్నా ఈఈ చిలుకపాటి హుస్సేన్ ఎన్‌వోసీ ఇచ్చేందుకు సత్యపాల్‌రెడ్డి నుంచి రూ.14 వేల లంచం డిమాండ్ చేశారు. దీంతో ఆయన ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. పూర్తి వివరాలు తెలుసుకుని ఏసీబీ అధికారులు వల పన్ని సత్యపాల్‌రెడ్డి నుంచి రూ. 14 వేలు తీసుకుంటున్న ఈఈ చిలుకపాటి హుస్సేన్‌తో పాటు రూ.2 వేలు లంచం తీసుకున్న అసిస్టెంట్ టెక్నికల్ ఆఫీసర్ రవీందర్‌ను కూడా రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఈ ఇద్దరిని అదుపులోకి తీసుకుని విచారించారు. నేడు కోర్టులో రిమాండ్ చేయనున్నట్టు ఏసీబీ డీఎస్పీ సాంబయ్య తెలిపారు.

### రెచ్చిపోతున్న లంచావతారులు..

**జనగామ జిల్లాలో** ఏసీబీ అధికారులు వరుస దాడులతో హడలెత్తిస్తున్నారు. ఏడాదిన్నర కాలంలో జిల్లాలో 12 మంది లంచావతారలను వల పన్ని పట్టుకున్నారు. ఇందులో ఇద్దరు ఉన్నత స్థాయి మహిళా ఉద్యోగులు కాగా, 10 మంది పురుషులు ఉన్నారు. వారి వివరాలు పరిశీలిస్తే...



**జిల్లా వైద్యారోగ్యశాఖ** ఉన్నతాధికారిగా పనిచేసిన డాక్టర్ ప్రశాంత్, ఆయన జూనియర్ అసిస్టెంట్ అజహర్‌ను ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. ప్రశాంత్ ఓ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగిని పర్మినెంట్ చేసేందుకు లక్ష రూపాయల లంచం డిమాండ్ చేశారు. అంతకుముందు కూడా జనగామలో అదే శాఖ ఓ కింది స్థాయి ఉద్యోగి కూడా ఏసీబీకి చిక్కాడు.

**రఘునాథపల్లి మండలం** కంచనపల్లికి చెందిన పకిడె శివాజీ జూలై నెలలో రూ.20 వేల లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు పట్టు బడ్డారు. పంచాయతీలో జరిగిన అభివృద్ధి పనులకు బిల్లులు చేసేందుకు శివాజీ మాజీ సర్పంచ్ విజయ నుంచి లంచం డిమాండ్ చేశారు. ఏడాదిన్నర కింద రఘునాథపల్లి మండల కేంద్రానికి చెందిన పంచాయతీ కార్యదర్శి సంతోష్‌తో పాటు వాటర్ మెన్ నాగేశ్ కూడా ఏసీబీకి చిక్కారు.



**ఇక జనగామ మున్సిపల్** కమిషనర్‌గా పనిచేసిన జంపాల రజిత, ఆమె కారు డ్రైవర్ నవంబర్‌లో ఏసీబీకి పట్టుబడ్డారు. రజిత ఓ ఇంటిని మార్టిగేజ్ కోసం రూ.60 వేలు లంచం డిమాండ్ చేసి రూ.40 వేలు తీసుకుంటూ దొరికిపోయారు.

**నర్మెట మోడల్ స్కూల్** ప్రిన్సిపాల్ ఎస్.అనురాధ సహా పీజీటీ మరాఠి మల్లేశ్, స్టేషన్‌ఘన్‌పూర్ పంచాయతీ కార్యదర్శి శ్రీహరి సైతం అధికారులకు చిక్కారు. ఇన్ని ఘటనలు జరిగినా లంచగొండి అధికారుల్లో మాత్రం మార్పు రావడం లేదు.

**తాజాగా.. జనగామ** కలెక్టరేట్ లో ఆర్అండ్‌బీ శాఖలో పనిచేస్తున్న ఈఈ చిలుకపాటి హుస్సేన్‌తో పాటు ఏటీవో రవీందర్ శుక్రవారం ఏసీబీ అధికారులకు పట్టుడ్డారు.



## ట్రాఫిక్ రూల్స్ పాటించాలి

### కలెక్టర్ రిజ్వాన్ బాషా

**జనగామ, మన చౌరాస్తా :** రోడ్డు ప్రమాడాల నివారణకి ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ రూల్స్ పాటించాలని కలెక్టర్ రిజ్వాన్ బాషా తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో రోడ్ భద్రత కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు పకడ్బందీ చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. వాహనదారులు రోడ్డు భద్రత నిబంధనలు పాటిస్తూ వాహనాలను నడపాలన్నారు. అతివేగం వల్ల వాహనాలు అదుపు తప్పి ప్రమాదాలు సంభవిస్తున్నాయన్నారు జిల్లా ఆరంభం అయ్యే దగ్గరి నుంచి ముగింపు ప్రాంతం వరకు పోలీస్, నేషనల్ హైవే, మున్సిపల్ శాఖలకు చెందిన అధికారులు జాయింట్ ఇన్‌స్పెక్షన్ చేసి ప్రమాదాలు తరుచూ జరుగుతున్న ప్రాంతాలను గుర్తించాలన్నారు. వాటి నివారణకు తీసుకోవాలని ఆదేశించారు. ద్విచక్ర వాహనం నడిపే వారు తప్పనిసరిగా హెల్మెట్లు ధరించాలని సూచించారు. ప్రమాదాలు జరిగే ముఖ్య ప్రదేశాల్లో ప్రమాద సూచికలు, మలుపుల వద్ద స్పీడ్ లిమిట్ సూచికలు తప్పనిసరిగా ఉండాలన్నారు. రోడ్డు ప్రమాదాలపై కాలేజీల్లో యువతకి అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో డీసీపీ రాజమహేంద్ర నాయక్, జిల్లా రవాణా శాఖ అధికారి, జనగామ, వర్ధన్నపేట ఏసీపీలు, మున్సిపల్ కమిషనర్, నేషనల్ హైవే , పంచాయతీ రాజ్, ఎలక్ట్రిసిటీ, ఆర్టీసీ అధికారులు పాల్గొన్నారు.




## గర్జనకు తరలిన ఎస్ఎఫ్ఐ నేతలు

**జనగామ, మన చౌరాస్తా :** ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో శుక్రవారం హైదరాబాద్‌లో జరిగిన విద్యార్థి మహా గర్జన సభకు జనగామ జిల్లా కేంద్రం నుంచి 300 మంది నాయకులు తరలివెళ్లారు. జనగామ నుంచి వెళ్లిన బస్సుకు ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ధర్మ భిక్షం జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇందిరా పార్కు వద్ద ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో విద్యా రంగ సమస్యల పరిష్కారం కోసం పోలీసుల నుంచి అనుమతి తీసుకొని శాంతియుతంగా ధర్నా నిర్వహించినట్టు తెలిపారు. అయితే తిరుగు ప్రయాణంలో చిక్కడపల్లి సీఐ అతి ఉత్సాహంతో బస్సులను పోలీసు స్టేషన్‌కి తరలించారని పేర్కొన్నారు. నాయకులను అక్రమ అరెస్ట్ చేసే క్రమంలో ధర్మ భిక్షంకు స్వల్ప గాయాలయ్యాయని నాయకులు తెలిపారు. వెంటనే సెంట్రల్ జోన్ డీసీపీ అకాన్ష్ యాదవ్‌తో ఫోన్‌లో మాట్లాడి ఫిర్యాదు చేశామన్నారు. అనంతరం విద్యార్థి సంఘాల నాయకులను వదిలేశారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం కూడా గత ప్రభుత్వం లాగానే విద్యార్థులను తీవ్ర ఇబ్బందులను గురిచేస్తోందిని మండిపడ్డారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి విద్యారంగ సమస్యలు పరిష్కరించకుంటే వరకు ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు లవ కుమార్, దాసగాని సుమ, జిల్లా సహాయ కార్యదర్శి యకన్నా రాథోడ్, ఆర్య, మురళి, జిల్లా నాయకులు కీర్తన, దిన, నివేదిక, అక్షిత్, ప్రణయ్, ధన్వంతి, చందన పాల్గొన్నారు.

Local News




# బాపూజీ.. భావితరాలకు స్ఫూర్తి

- **కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా**

**జనగామ, మన చౌరాస్తా :** స్వాతంత్ర పోరాటం, నిజాం నిరంకుశ వ్యతిరేక ఉద్యమం, ప్రత్యేక తెలంగాణ కోసం ఇలా మూడు దశల ఉద్యమాల్లో ప్రముఖ పాత్ర పోషించి దేశసేవకు అంకితమైన వ్యక్తి కొండా లక్ష్మణ్ బాపూజీ మనకెంతో ఆదర్శప్రాయుడని జనగామయ కలెక్టర్ రిజ్వాన్ బాషా అన్నారు. జిల్లా వెనుకబడిన తరగతుల శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్ లో బాపూజీ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బాపూజీ చిత్ర పటానికి కలెక్టర్ పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నేత ఉత్పత్తుల క్రయ, విక్రయాల కోసం కొండా లక్ష్మణ్ మొట్టమొదటగా సహకార సంఘాలని ఏర్పాటు చేశారని పేర్కొన్నారు. స్వదేశీ వస్త్రాల ప్రాముఖ్యతను తెలియజేస్తూ.. చేనేత సంఘాలను బలోపేతం చేశారని కొనియాడారు. ఉద్యమాలతో పాటు ప్రజాప్రతినిధిగా కూడా నిరంతరం ప్రజాసేవ కోసం తపించిన బాపూజీ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రోహిత్ సింగ్, జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారి రవీందర్, వివిధ శాఖలకు చెందిన అధికారులు, బీసీ కుల సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## బలహీన వర్గాల ఆశాజ్యోతి

**పాలకుర్తి, మన చౌరాస్తా :** బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి కొండా లక్ష్మణ్ బాపూజీ అని పాలకుర్తి నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జ్ హనుమాండ్ల ఝాన్సీరెడ్డి అన్నారు. పట్టణంలోని రాజీవ్ చౌరస్తా ఆచార్య కొండ లక్ష్మణ్ బాపూజీ జయంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి ఝాన్సీరెడ్డి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, పద్మశాలి సంఘం సభ్యులు, పార్టీ సీనియర్ నాయకులు, యూత్ నాయకులు పాల్గొన్నారు.





## పోపా ఆధ్వర్యంలో...

**జనగామ, మన చౌరాస్తా :** పట్టణ అంబేద్కర్ విగ్రహం వద్ద కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి ఘనంగా నిర్వహించారు. జనగామ పోపా అధికార ప్రతినిధి పిట్టల సతీష్ అధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలకు జిల్లా పద్మశాలి సంఘం నాయకులు వేముల బాలరాజు, జనగామ పోపా అధ్యక్షులు దోర్నాల వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ లీగల్ సెల్ అధ్యక్షుడు సామల పరమేశ్వర్ పాల్గొని బాపూజీ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ బాపూజీ దేశానికి చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో జనగామ పోపా ఉపాధ్యక్షులు ఏల జనార్దన్, సహాయ కార్యదర్శి నల్ల ఆంజనేయులు, ఎల్లంల భారత టీసీ సొసైటీ అధ్యక్షుడు బిర్రు కమలాకర్, మాజీ అధ్యక్షుడు కోడం శ్రీనివాస్, బిట్ల బాబు, రిటైర్డ్ హెచ్ఎం బండారి ఏకనాథం, చింతకింది వేణు మాధవ్, పాము నర్సింగరావు, వల్లలా రామలింగం, సక్కుబాయి, నల్ల యాదగిరి, పత్తిపాక ఉమ, సుమతి, అజయ్, మహేష్ పాల్గొన్నారు.

## డీసీసీ కార్యాలయంలో

**జనగామ, మన చౌరాస్తా :** జనగామ డీసీసీ కార్యాలయంలో కొండ లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బాపూజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జనగామ డీసీసీ అధ్యక్షుడు, నియోజకవర్గ ఇంచార్జ్ కొమ్మూరి ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ స్వరాష్ట్రం కోసం ప్రతిపించ తెలంగాణ వాది, నిబద్ధత కలిగిన రాజకీయ వేత్త, స్వాతంత్ర సమరయోధులు ఆచార్య కొండ లక్ష్మణ్ బాపూజీ అని కొనియాడారు. కార్యక్రమంలో జనగామ మండల అధ్యక్షుడు లింగాల నర్సిరెడ్డి, బనుక శివరాజ్, నూకల బాల్ రెడ్డి, మెరుగు బాలరాజు, మిద్దె పాక సిద్దులు, బృంగి భాస్కర్, గొలుసుల దుర్గేష్, మురహరి పాల్గొన్నారు.





## మండల విద్యాశాఖ అధికారికి సన్మానం

**జఫర్‌గడ్, మన చౌరాస్తా :** జఫర్ గఢ్ మండల నోడల్ అధికారిగా కూనూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గెజిటెడ్ హెడ్ మాస్టర్గా పనిచేస్తున్న మహ్మద్ పర్వేజ్ ఇటీవల మండల విద్యాశాఖ అధికారిగా అదనపు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా జఫర్ గఢ్ మండల యూటీఎఫ్ నాయకులు ఆయనను అభినందించారు. కూనూరు ఉన్నత పాఠశాలను సందర్శించి పర్వేజ్‌ను శాలువతో సత్కరించారు. అనంతరం టీఎస్‌యూటీఎస్ జనగామ జిల్లా ఉపాధ్యక్షుడు మంగు జయప్రకాశ్ మాట్లాడుతూ మండలంలోని ఉపాధ్యాయులు, విద్యార్థుల సమస్యల సత్వర పరిష్కారానికి పర్వేజ్ కృషి చేయాలని కోరారు. పర్వేజ్ మాట్లాడుతూ ఉపాధ్యాయ సంఘాల ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయుల సహకారంతో మండల విద్యారంగ అభివృద్ధి కోసం తప్పనిసరిగా పాటుపడుతానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జనగామ జిల్లా కోశాధికారి తాడూరి సుధాకర్, జిల్లా కార్యదర్శి కందుల శ్రీనివాస్, మండల ప్రధాన కార్యదర్శి భాను ప్రకాష్, సీనియర్ నాయకులు పిట్టల మహేందర్, శ్రీనివాస్, వంశీకృష్ణ పాల్గొన్నారు.



# సీపీఎం పేదల పార్టీ

- **పోరాటాలతోనే సమస్యల పరిష్కారం**
- **సీపీఎం మండల కార్యదర్శి వెంకటేశ్**

**బచ్చన్నపేట, మన చౌరాస్తా :** పేదల పక్షాన నిలబడి వారి సమస్యల పరిష్కారం కోసం పోరాడే పార్టీ సీపీఎం అని ఆ పార్టీ మండల కార్యదర్శిం బెల్లకొండ వెంకటేశ్ అన్నారు. శుక్రవారం బచ్చన్నపేట మండలం పోచన్నపేటలో సీపీఎం గ్రామ శాఖ మహాసభల సందర్భంగా సీనియర్ నాయకుడు మహంకాళి జనార్దన్ పార్టీ జండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పోచన్నపేట వీధుల గుండా మహా ప్రదర్శన నిర్వహించారు. అనంతరం కళ్లెం నరసింహులు అధ్యక్షతన జరిగిన సమావేశంలో వెంకటేశ్ మాట్లాడారు. పేద ప్రజల పక్షాన పోరాడేది సీపీఎం ఒకటేనని పోరాటాలతోనే సమస్యలు పరిష్కారం అవుతాయని అన్నారు. కేంద్రంలో మోడీ ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చి పేద ప్రజలకు చేసింది ఏమీ లేదన్నారు. ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి కార్పొరేట్ శక్తులకు కొమ్ముకాస్తుందని ఆరోపించారు. అలాగే రాష్ట్రంలో కాంగ్రెస్ రేవంత్ రెడ్డి ఎన్నికల ముందు ఆరు గ్యారెంటీల పథకాన్ని తీసుకువచ్చినని, 6 గ్యారంటీల పథకాలను ప్రజలకు రేషన్ కార్డు లింక్ పెట్టి వాటిని పేదలకు అందకుండా చేస్తున్నాడని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై సీపీఎం భవిష్యత్తులో పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ మండల కమిటీ సభ్యులు రావుల రవీందర్ రెడ్డి, మిన్నలపురం ఎల్లయ్య, తాడెం రాములు, ఇంజ ఎల్లయ్య, చింతపండు కిష్టయ్య, శ్రీపతి మల్లయ్య, పరదేశి సిద్ధులు, మార్త వెంకటేశం, వేముల రాణి పాల్గొన్నారు. అనంతరం గ్రామ శాఖ మహాసభలో బత్తుల సిద్ధులను పార్టీ గ్రామశాఖ కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

# హామీలను నిలబెట్టుకున్నాం

- మంత్రి కొండ సురేఖ
- చేర్యాలలో కళ్యాణలక్ష్మి, షాదీముబాక్ చెక్కుల పంపిణీ



**చేర్యాల, మన చౌరాస్తా :** ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను నిలబెట్టుకున్న ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని రాష్ట్ర దేవాదాయ, అటవీ పర్యావరణ శాఖ మంత్రి కొండ సురేఖ అన్నారు. శుక్రవారం చేర్యాలలోని రేణుక గార్డెన్స్‌లో చేర్యాల, మద్దూరు, కొమురవెల్లి, దూల్మిట్ట మండలాలకు చెందిన 232 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి సురేఖను జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి బొకే అందజేసి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం జరిగిక సమావేశంలో మంత్రి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం పేదల ప్రభుత్వమని, ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేస్తుందన్నారు. రాబోయే రోజుల్లో మరిన్ని పథకాలు తీసుకొస్తామని పేర్కొన్నారు. ఎమ్మెల్యే పల్లా కొన్ని అభివృద్ధి పనులకు సంబంధించి తన దృష్టికి తీసుకువచ్చారని, ఎవరు చేసిన ప్రజల గురించే కాబట్టి వాటిని పూర్తి చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ తాము గతంలో డివిజన్ చేయలేకపోయామని, ఇప్పుడు రెవిన్యూ డివిజన్ విషయంలో జిల్లా మంత్రి చొరవ తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా పలు అభివృద్ధి పనులకు నిధులులు ఇవ్వాలని మంత్రికి వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ స్వరూప రాణి, కౌన్సిలర్ ఆడెపు నరేశ్ తదితరులు పాల్గొన్నారు

## ఆరు గ్యారెంటీలపై నిలదీత



చెక్కులు పంపిన జరుగుతున్న సందర్భంలో మంత్రి కొండ సురేఖ మాట్లాడుతుండగా బీఆర్ఎస్ కార్యకర్తలు నిరసన తెలిపారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారెంటీలు అమలు చేయడం లేదంటూ ప్లకార్డులు ప్రదర్శించారు. కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దీంతో కాంగ్రెస్ కార్యకర్తలు సైతం నినాదాలు అందుకున్నారు. 'పల్లా.. డౌన్ డౌన్, కొమ్మూరి జై..' అనడం కొంత ఉద్రిక్త వాతావరణం నెలకొని చెక్కుల పంపిణీ కార్యక్రమం రసభసగా మారింది. దీంతో పోలీసులు కలుగజేసుకుని ఇరువర్గాలను శాంతింపజేశారు.



## సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

**జనగామ, మన చౌరాస్తా :** పాడి రైతులకు రూ.50 కోట్లను చెల్లించిన సందర్భంగా విజయ డైరీ పాల ఉత్పత్తిదారుల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు దామెర నాగరాజు సంతోషం వ్యక్తం చేశారు. ఈ నిధుల్లో జనగామ జిల్లాకు రూ.5.79 కోట్లు జమా అయినట్టు తెలిసారు. ఈ సందర్భంగా శుక్రవారం జనగామ జిల్లా పాల కేంద్రంలో విజయ డైరీ పాల ఉత్పత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, పాడి పరిశ్రమ సహకార సమైక్య చైర్మన్ గుత్తా అమిత్ రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు.

## 'వరూధిని విరహం' ప్రోమో విడుదల



**జనగామ, మన చౌరాస్తా :** అల్లసాని పెద్దన రచించిన మనుచరిత్ర అనే పౌరాణిక గ్రంథం నుంచి తీసుకున్న వరూధిని ప్రవరాఖ్యుల ప్రణయ సన్నివేశాన్ని గేయ రూపంలో 'వరూధిని విరహం' పేరున తెరకెక్కించారు. దీనికి సంబంధించిన ప్రోమో పోస్టర్ శుక్రవారం కవులు కళాకారుల ఐక్యవేదిక ఆధ్వర్యంలో జనగామలో విడుదల చేసారు. ప్రముఖ కవి పెసరు లింగారెడ్డి ఈ పాట 'మనం ఛానల్' ద్వారా యూట్యూబ్‌లో విడుదల కానుంది. ప్రముఖ జానపద గాయకులు శిరీష, బొడ్డు దిలీప్ పాడిన ఈ పాటకు సాహిత్యాన్ని పెసరు లింగారెడ్డి సమకూర్చగా, ప్రవీణ్ కాయితోజు స్వరకల్పన చేసి చక్కటి సంగీతాన్ని అందించారు. కేరళ, కర్ణాటక రాష్ట్రాల సరిహద్దుల్లో ఉన్న సుందరమైన ప్రాంతాల్లో పాటను చిత్రీకరించారు. యూట్యూబ్ స్టార్స్ ప్రియా శర్మ, శ్రీకాంత్ నాయక్ వరూధిని ప్రవరాఖ్యుల పాత్రలను పోషించి, తమ సహజ నటనతో ఆకట్టుకున్నారు. అప్పుడప్పుడు సందేశాత్మక పాత్రలలో నటిస్తున్న లింగారెడ్డి కూడా ఒక ప్రత్యేక పాత్రలో కనిపించనున్నారు. ఈ పాటలో ఆశల సాయిదీప్ అందమైన సినిమాటోగ్రఫీ, మహిపాల్ నాయక్ చక్కని కొరియోగ్రఫీ అందించగా, లింగప్ప మేకప్ కళాకారులను అద్భుతంగా ప్రదర్శింప చేసింది. కర్ణాటక రాష్ట్రానికి చెందిన సీసీఆర్టీ అధ్యక్షుడు చిన్నప్పగౌడ శిష్యులు నలుగురు అమ్మాయిలు గాంధర్వ కన్యలుగా నటించి మంచి నృత్యాన్ని ప్రదర్శించారు. కార్యక్రమంలో కవులు, కళాకారులు జి.కృష్ణ, అయిలా సోమనర్సింహచారి, పెట్లోజు సోమేశ్వరాచారి, లగిశెట్టి ప్రభాకర్, చిలుమోజు దక్షిణామూర్తి, కొట్టె శ్రీలత, బుదారపు లావణ్య పాల్గొన్నారు.






# విద్యతో పాటు కళల్లో కూడా రాణించాలి

- కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా

**జనగామ, మన చౌరాస్తా :** విద్యార్థులు విద్యాతో పాటు కళల్లో కూడా రాణించాలని కలెక్టర్ రిజ్వాన్ బాషా అన్నారు. జనవరి 12న స్వామి వివేకానంద జయంతి సందర్భంగా ప్రతీ సంవత్సరం జాతీయ స్థాయిలో జనవరి 12 నుంచి 16 వరకు యువజన వారోత్సవాలు నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ నేపథ్యంలో జిల్లా యువజన, క్రీడల శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా స్థాయి యువజనోత్సవాలు స్థానిక జూబ్లీహిల్స్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు చదువుతో పాటు వివిధ సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొనడం ద్వారా మానసిక, శారీరక ఉల్లాసం కలిగి వ్యక్తిత్వ వికాసం పెరుగుతుందన్నారు. ఈ పోటీల్లో పాల్గొని ప్రథమ స్థానం పొందిన వారిని రాష్ట్ర స్థాయికి పంపించి, ఆ తర్వాత రాష్ట్ర స్థాయిల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన కళాకారులను జనవరి 12 నుంచి 16 వరకు జరిగే జాతీయ స్థాయి యువజనోత్సవాల్లో పాల్గొనడానికి పంపనున్నట్టు తెలిపారు. అంతే కాకుండా ఇలాంటి పోటీల్లో పాల్గొన్నప్పుడు ఇచ్చే సర్టిఫికెట్లు వివిధ రకాల పోటీ పరీక్షల సమయంలో,



ఉద్యోగాల ఎంపికప్పుడు, అడ్మిషన్, ఇంటర్వ్యూ తదితర ప్రక్రియల్లో చాలా ఉపయోగపడతాయని తెలిపారు. అనంతరం విద్యార్థులు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలను కలెక్టర్ తిలకించి వారిని అభినందించారు. యువజనోత్సవాల్లో భాగంగా జానపద నృత్యం (సోలో, గ్రూప్ ), జానపద పాటలు ( గ్రూప్, సోలో ), కవిత్వం ( హిందీ, ఇంగ్లీష్ ), వ్యాస రచన, పెయింటింగ్, హస్త కళలు, వస్త్రాలు తదితర అంశాలలో పోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో క్రీడాశాఖ అధికారులతో పాటు స్థానిక కౌన్సిలర్ జక్కుల అనిత తదితరులు పాల్గొన్నారు.

# ఖరీఫ్ కొనుగోలు సాఫీగా సాగాలి

- అధికారులంతా సమన్వయంతో పని చేయాలి
- కలెక్టర్ రిజ్వాన్ బాషా ఆదేశాలు

**జనగామ, మన చౌరాస్తా :** జిల్లాలో ఖరీఫ్ పంటలకి సంబందించిన ధాన్యం కొనుగోలు ప్రక్రియ సాఫీగా సాగాలని కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా అన్నారు. అదనపు కలెక్టర్ రోహిత్ సింగ్‌తో కలిసి కలెక్టర్ ధాన్యం కొనుగోలుపై కలెక్టరేట్ లో రివ్యూ నిర్వహించారు. ఈ సందదర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లోలోని ఈ ఖరీఫ్‌కి 65,989 ఎకరాలలో సన్న రకం, 1,37,406 ఎకరాలలో దొడ్డు రకం ధాన్యం సాగు జరిగిందని తెలిపారు. మొత్తం 2,05,109 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలుకు వచ్చే అంచనా ఉన్నందున... ఇందుకు తగ్గట్టుగా అధికారులు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. జిల్లాలో ఐకేపీ 94, పీఏసీఎస్ 84, ఇతర 2 మొత్తం 180 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. త్వరగా కేంద్రాలు అన్నీ ప్రారంభం కావాలన్నారు. ఏ కేంద్రానికి.. ఎప్పుడు తమ ధాన్యం తీసుక రావాలో రైతులకు స్పష్టంగా తెలిసే విధంగా వ్యవసాయ అధికారులు టోకెన్స్ జారీ చేయాలన్నారు. ఎటువంటి అవకతవకలు జరగకుండా ప్రతీ కేంద్రం వద్ద డాక్యుమెంటేషన్ సరిగ్గా నిర్వహిస్తూ.. రికార్డులను పక్కగా మెయింటెన్ చేయాలన్నారు. వ్యవసాయ, మార్కెటింగ్ తదితర శాఖల అధికారులు కోఆర్డినేషన్‌తో పని చేసి ధాన్యం కొనుగోలు ప్రక్రియ సజావుగా జరిగేలా చూడాలన్నారు. సమావేశంలో డీఆర్‌డీవో పీడీ వసంత, జిల్లా సివిల్ సప్లై అధికారి సరస్వతి, జిల్లా వ్యవసాయ అధికారి రామారావు నాయక్, జిల్లా మార్కెటింగ్ అధికారి నరేందర్, మిల్లర్లు తదితరులు పాల్గొన్నారు.

# అందరికీ నమస్కారం

## తెలుగులో మాట్లాడిన జాన్వీ పాప

**మన చౌరాస్తా, సినిమా :** బాలీవుడ్ ముద్దుగుమ్మ జాన్వికపూర్ టాలీవుడ్ లోకి గ్రాండ్ గా ఎంట్రీ ఇవ్వనుంది. మ్యాన్ ఆఫ్ మాసెస్ ఎన్టీఆర్ హీరోగా నటిస్తున్న దేవర సినిమాతో ఆమె టాలీవుడ్‌లోకి అడుగు పెడుతోంది. దేవర సినిమా సెప్టెంబర్ 27న ప్రేక్షకుల ముందుకు రానుంది. కొరటాల శివ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న ఈ సినిమా రెండు భాగాలుగా ప్రేక్షకుల ముందుకు రానుంది. కాగా ఈ సినిమాలో చాలా మంది స్టార్ కాస్ట్ నటిస్తున్నారు. బాలీవుడ్ స్టార్ హీరో సైఫ్ అలీ ఖాన్ విలన్ గా నటిస్తున్నాడు. అలాగే టాలీవుడ్‌కు చెందిన చాలా మంది నటిస్తున్నారు. ఇక ఈ సినిమా రిలీజ్ దగ్గర పడటంతో ఈ సినిమా పై భారీ అంచనాలు క్రియేట్ చేసింది. ఇక ఈ సినిమా ప్రమోషన్స్ కూడా జెట్ స్పీడ్ గా జరుగుతున్నాయి. అయితే ఇప్పటికే దేశంలోని పలు నగరాల్లో దేవర మూవీ టీమ్ ప్రమోషన్స్ నిర్వహించింది. నిన్న ( ఆదివారం) హైదరాబాద్ లో దేవర మూవీ ప్రీరిలీజ్ ఈవెంట్ ను ఏర్పాటు చేశారు మేకర్స్. అయితే ఈ ప్రీ రిలీజ్ ఈవెంట్ కు తారక్ అభిమానులు భారీగా తరలి వచ్చారు. భారీగా అభిమానులు రావడంతో అక్కడున్న సెక్యూరిటీ వారిని ఆపే ప్రయత్నం చేశారు. అభిమానులు తిరగబడ్డారు. దాంతో అక్కడ గందరగోళం నెలకొంది. ఫలితంగా దేవర మూవీ ప్రీ రిలీజ్ ఈవెంట్ ను క్యాన్సిల్ చేశారు. దేవర మూవీ ప్రీ రిలీజ్ ఈ వెంత్ క్యాన్సిల్ అవ్వడంతో ఎన్టీఆర్ ఓ ఎమోషనల్ వీడియోను విడుదల చేశారు. మీకంటే నేనే ఎక్కువ బాధపడుతున్నాను. మిమ్మల్ని కలవాలని, సినిమా గురించి మీకు వివరించాలని అనుకున్నా కానీ సెక్యూరిటీ రీజన్స్ వల్ల ఈవెంట్ క్యాన్సిల్ అయ్యిందని ఎన్టీఆర్ వీడియోలో తెలిపారు. ఆలాగే జాన్వికపూర్ కూడా ఓ వీడియోను విడుదల చేసింది. ఈ వీడియోలో జాన్వీ ముద్దుముద్దగా తెలుగులో మాట్లాడి ఆకట్టుకుంది. అందరికీ నమస్కారం. నన్ను స్వాగతించి ఇంతగా ఆదరిస్తున్నందుకు, నాపై ఇంత ప్రేమను కురిపిస్తున్నాడు తెలుగు ప్రేక్షకులకు ధన్యవాదాలు. నన్ను జానూ పాప అని పిలుస్తున్న ఎన్టీఆర్ అభిమానులకు ప్రత్యేక కృతజ్ఞతలు అని చెప్పుకొచ్చింది. అలాగే నేను ఈ మాటలు స్వయంగా మీతో చెబుదామనుకున్నాను. కానీ ఈ సారికి అలా కుదరలేదు. మిమ్మల్నందరినీ త్వరలోనే కలుస్తాననుకుంటున్న. ప్రస్తుతానికి ఇది నా నుంచి మీకు ఈ చిన్న మెసేజ్ అంటూ ఓ వీడియోను రిలీజ్ చేసింది జాన్వీ. ఈ వీడియో ఇప్పుడు వైరల్ అవుతుంది.